స్థాయి సంఘం ఏకగ్రీవం!

ఎంఐఎం-8, కాంగ్రెస్-7... 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ప్రకటన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయింది. బీఆర్ఎస్ అధిష్ఠానం నిర్ణయం మేరకు ఆ పార్టీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ఎన్నిక లేకుండా ఏకగ్రీవంతో ముగిసింది. ఏడాది కాల పరిమితితో మొత్తం 15 సభ్యుల ఎన్నికకు గాను మొత్తం 17 మంది నామినేషన్ వేసిన సంగతి తెలిసిందే. ఎంఐఎం పార్టీ నుంచి 8 మంది, కాంగ్రెస్ పార్టీ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్లు వేయగా, పరిశీలనలో అన్ని ఓకే అయ్యాయి. ఈ మేరకు షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 21 (శుక్రవారం) మధ్యాహ్నం 3 గంటల లోపు ఉపసంహరణ అవకాశం ఉండటంతో గురువారం బీఆర్ఎస్ పార్టీ నుంచి నామినేషన్ వేసిన ప్రసన్న లక్ష్మి , చివరి రోజు కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తమ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు కమిషనర్ ఇలంబర్తి ప్రకటించారు.

ఏడాది కాల పరిమితి

స్టాండింగ్ కమిటీ సభ్యులుగా వీరి పదవీ కాలం ఒక ఏడాది పాటు ఉంటుంది. జీహెచ్ఎంసీలో రూ. రెండు కోట్ల నుంచి రూ. 3 కోట్ల మేర విలువైన పనులకు స్టాండింగ్ కమిటీ వారానికోసారి సమావేశం అవుతుంది. అందుకు వారంలో ఏదో ఒక రోజును ఎంపిక చేసుకోవడం అనవాయితి. గత పాలక మండలిలో ప్రతి గురువారం నిర్వహిస్తూ వచ్చారు.

ఎన్నికైన స్టాండింగ్ కమిటీ సభ్యులు

ఎంఐఎం నుంచి గౌస్ ఉద్దీన్ మహ్మద్, డాక్టర్ ఆయేషా హుమేర, సమీనా బేగం, పర్వీన్ సుల్తానా, మహ్మద్ సలీం, అబ్దుల్ వాహెద్, సయ్యద్ మినహాజుద్దీన్, బాత జబీన్ లు, కాంగ్రెస్ నుంచి మహాలక్ష్మి రామన్ గౌడ్, బురుగడ్డ పుష్ప, సీఎన్ రెడ్డి, వి. జగదీశ్వర్ గౌడ్, బానోతు సుజాత, బొంతు శ్రీదేవి, బాబా ఫసియుద్దీన్ లు ఉన్నారు.

స్టాండింగ్ కమిటీలో బలంగా ఎంఐఎం

వారిది ఒక్కటే ఎజెండా. అధికార పార్టీ ఏది ఉంటే ఆ పార్టీతో మంట కాగడం పతంగి పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. గతంలో బీఆర్ఎస్‌తో జత కట్టిన ఎంఐఎం పార్టీ ఈ సారి కాంగ్రెస్‌కు అండగా నిలబడింది. పరస్పర అవగాహన ఒప్పందంలో భాగంగానే ఎంఐఎం పార్టీ స్టాండింగ్ కమిటీలో 8 మందితో నామినేషన్లు వేసి తమ ఆధిక్యతను ప్రదర్శించుకున్నది. బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం పార్టీతో కలిసి 7 సభ్యులతో స్టాండింగ్ కమిటీలో చోటు కల్పించుకున్నది. ఎన్నికల ఏడాది కావడంతో వ్యూహాత్మకంగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రభుత్వ విధానపరమైన లోపాలను ఎండగట్టడమే లక్ష్యంగా పనిచేసేలా కార్యాచరణను రూపొందించుకున్నది. కాగా, స్టాండింగ్ కమిటీలో రెండు పార్టీలకు సంబంధించి ఒక్కో పార్టీ నుంచి నలుగురు మహిళా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉండటం గమనార్హం.

హెచ్ సిటీ.. పీచే ముడ్!

- మూడు అడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కు
- తాజాగా మూడు శాఖల్లో కాక రేపుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు
- మెట్రో మార్గాల్లో జీహెచ్ఎంసీ పనులకు అడ్డు తగిలిన టీజీఐఐసీ
- విప్రో జంక్షన్ పనుల నుంచి తప్పుకోవాలని సూత్రప్రాయ నిర్ణయం
- మెట్రో, జీహెచ్ఎంసీ, టీజీ ఐఐసీ శాఖల మధ్య సమన్వయ లోపం
- ఇంజనీర్లలో చర్చనీయాంశమైన హెచ్ సిటీ ప్రాజెక్టు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ): హెచ్ సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టు ఆ మూడు శాఖల్లో మంట పుట్టిస్తున్నది. ఎస్సార్‌డీపీ స్థానంలో సిగ్నళ్లు లేని జంక్షన్లే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెరపైకి హెచ్ సిటీ ప్రాజెక్టును తీసుకువచ్చి రూ.2,373 కోట్ల పనులకు టెండర్లు పిలవాలని సర్కారు జీహెచ్ఎంసీని ఆదేశించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ అన్ని చోట్ల పనులకు టెండర్లకు సిద్ధమైన దరిమిలా.., కొత్త పంచాయతీ మెట్రో, టీజీఐఐసీ రూపంలో కొత్త పంచాయతీ వచ్చి పడింది. ఈ మూడు శాఖల మధ్య సమన్వయం లోపం కారణంగా హెచ్ సిటీ ప్రాజెక్టు టెండర్లలో మరింత ఆలస్యం కావడమే కాదు, టీజీఐఐసీ డిమాండ్ మేరకు ఒక చోట నుంచి జీహెచ్ఎంసీ తప్పుకోవడం ఇంజనీర్లలో ఇప్పుడు మరింత చర్చనీయాంశంగా మారింది.

హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా నిర్మించబోయే ఫ్లై ఓవర్ల మార్గాల్లో మెట్రో రైలు వచ్చే ప్రాంతాల్లో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ల నిర్మాణాలు జరపాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా ఖాజాగూడ జంక్షన్, ఐఐఐటీ జంక్షన్, విప్రో జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్ల పనులకు రూ.837 కోట్ల పరిపాలన అనుమతులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డిజైన్లను ఖరారు చేసి టెండర్లను సిద్ధం చేసింది. రూ.158 కోట్లతో 1.05 కిలోమీటర్ల మేరలో విప్రో సర్కిల్ దగ్గర రెండు మార్గాల్లో నాలుగు లేన్ల ఫ్లై ఓవర్లు నిర్మించనున్నారు. విప్రో గేట్ దగ్గర నుంచి ప్రారంభమయ్యే ఈ ఫ్లై ఓవర్ ఎస్సెంచర్‌కు ముందుగా దిగనుంది. ఇదే మార్గంలో మెట్రో రైల్ రెండో దశలో భాగంగా రాయదుర్గం నుంచి కోకాపేట నియో పోలీస్ వెళ్లే మార్గం రానుంది. అందుకు అనుగుణంగా ఫ్లై ఓవర్, పై నుంచి మెట్రో వెళ్లేలా జీహెచ్ఎంసీ ప్లాన్ చేసింది. ఐతే, మెట్రో నిర్మాణం మెట్రో, ఫ్లై ఓవర్ వంతెన మాత్రం జీహెచ్ఎంసీ చేపట్టాల్సి ఉంది. కానీ, ఇక్కడే టీజీఐఐసీ మా పరిధిలో ఉంది.. కాబట్టి మేం ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు చేపడతామంటూ జీహెచ్ఎంసీకి అడ్డు తగిలింది. మెట్రో భవన్‌లో ఈ మూడు శాఖల మధ్య సమావేశంలో టీజీఐఐసీ శుక్రవారం తేల్చి చెప్పింది. దీంతో జీహెచ్ఎంసీ వెనక్కి తగ్గి విప్రో సర్కిల్ వంతెన పనుల నుంచి తప్పుకోవాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఐతే, డిజైన్లతో సిద్ధంగా ఉన్న ఈ ప్రాజెక్టు పనులను ఇప్పుడు అడ్డుకోవడం ఏమిటని టీజీఐఐసీ తీరు పట్ల జీహెచ్ఎంసీలో కొందరు ఇంజనీర్లు తీవ్రంగా మండిపడుతున్నారు. మొత్తంగా శాఖల మధ్య సమన్వయంతో హెచ్ సిటీ ప్రాజెక్టు పనులు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కనబడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రూ.220 కోట్లతో 1.52 కిలోమీటర్ల మేరలో ఖాజాగూడ చౌరస్తాలో పై వంతెన, అండర్ పాస్, రూ.459 కోట్లతో 3.25 కోట్లతో త్రిపుల్ ఐటీ జంక్షన్‌లో మూడు వంతెనలు, అండర్ పాస్ పనులకు టెండర్లను పిలిచేందుకు జీహెచ్ఎంసీ సిద్ధం అవుతున్నట్లు ఇంజనీర్లు తెలిపారు.

గురుకులాల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర గురుకులాల ఉమ్మడి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్ జిల్లా కో ఆర్డినేటర్, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల / కళాశాల ప్రిన్సిపాల్ వి.జయంతి తెలిపారు. 23న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లా పరిధిలో టీజీడబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాల, కళాశాల, ఫలక్ నుమా బాలుర పాఠశాల, కళాశాల, షేక్ పేట్ బాలబాలికల పాఠశాల, కళాశాల, మహీంద్రాహిల్స్, టీజీఆర్జేసీ బోరబండ బాలుర, బాలికల కళాశాలతో కలిపి మొత్తం 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 9:30 గంటల వరకు విద్యార్థులు చేరుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పాస్ ఫొటో, పరీక్ష ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్, ఆధార్ కార్డు తప్పకుండా తీసుకురావాలని, ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

25న బయో ఏషియా

మాదాపూర్, ఫిబ్రవరి 21: పరివర్తనాత్మక ఆవిష్కరణలను నడిపించడానికి గ్లోబల్ హెల్త్‌కేర్ లీడర్‌లను ఏకతాటి పైకి తీసుకువచ్చేందుకు హెచ్ఐసీసీలో ఈ నెల 25న జరగనున్న బయో ఏషియా 2025 వేదిక కానుంది. ఆసియాలో అగ్రగామి లైఫ్ సైన్సెస్, హెల్త్ టెక్ ఫోరమ్ అయిన బయో ఆసియా, లైఫ్ సైన్సెస్ రంగంలో భారతదేశాన్ని తిరుగులేని నాయకుడిగా మార్చడానికి ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లను ప్రేరేపించడానికి బయో ఏషియా స్ఫూర్తిదాయకంగా నిలవనుంది. బయో ఏషియా లైఫ్ సైన్సెస్ రంగంలో వేగవంతమైన పరివర్తనను నడిపించే ''మార్పు యొక్క ఉత్ప్రేరకం''గా వ్యవహరించడానికి సిద్ధంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్వీన్స్‌ల్యాండ్ గవర్నర్, డాక్టర్ జెన్నెట్ యంగ్, జీ 20 షెర్పా అమితాబ్ కాంత్, కేంద్ర ప్రభుత్వ పరిశ్రమ, సరఫరా శాఖ మంత్రి పియూష్ గోయల్ హాజరై ప్రసంగించనున్నారు. బయో ఆసియా 2025లో భారతదేశంతో పాటు ప్రపంచ పరిశ్రమల ప్రతినిధులు సైతం హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బయో ఆసియాలో అధిక ప్రభావ సెషన్‌లు, ప్యానెల్ చర్చలు, నెట్‌వర్కింగ్ అవకాశాలు ఉండనున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంరక్షణ, బయో టెక్నాలజీలో భారతదేశం కీలక పాత్ర పోషిస్తుండటంతో బయో ఆసియా 2025 సహకారాలు, విజ్ఞాన మార్పిడి, పెట్టుబడి అవకాశాల కోసం అసమానమైన వేదికను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణలకు కేంద్రంగా హైదరాబాద్ స్థానాన్ని బలోపేతం చేస్తూ, ప్రపంచ ఆరోగ్య సంరక్షణ పర్యావరణ వ్యవస్థకు దాని సహకారాన్ని బలోపేతం చేయడంలో ముందుంటుందన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మార్చి 5 నుంచి 25 వరకు నిర్వహణ
- 1,79,218 మంది విద్యార్థులకు 244 పరీక్షా కేంద్రాలు
- సమన్వయ సమావేశంలో డీఆర్‌వో వెంకటాచారి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ): మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, జిల్లాలో ని 1,79,218 మంది విద్యార్థులకు 244 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వారిలో ప్రథమ సంవత్సర విద్యార్థులు 85,753 మంది. కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 93,465 మంది ఉన్నారని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించే పరీక్షలకు ట్రాఫిక్ దృష్ట్యా విద్యార్థులు ఉదయం 8 గంటల వరకే కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. సంబంధిత అధికారులు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తతో అప్రమత్తంగా నిర్వహించాలని, ప్రశ్నాపత్రాల తరలింపులో పోలీసులు అత్యంత బాధ్యత, భద్రత పాటించాలని ఆదేశించారు. విద్యార్థులు సమయానుకూలంగా పరీక్షా కేంద్రాలకు చేరే విధంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, నిరంతరం పరీక్షా కేంద్రాల్లో విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకోవాలని, తాగునీరు, శానిటేషన్ తో పాటు అన్ని పరీక్షా కేంద్రాల్లో వైద్య సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచనల మేరకు నిర్దేశించిన సమయానికి అన్ని కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నం. 040 29700934 లో సంప్రదించాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి డి. ఒడ్డెన్న, ఏసీపీ భాస్కర్, ఆర్ ఎం బాబూ నాయక్, జిల్లా వైద్య అధికారి జె. వెంకటి, పోస్టల్ అధికారి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎస్‌జేఏటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సంజయ్, సంయుక్త కార్యదర్శి రాజశేఖర్

క్రీడలకు అధిక ప్రాధాన్యం: డిప్యూటీ సీఎం

ఎస్‌జేఏటీ డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సచివాలయంలోని తన చాంబర్‌లో స్పోర్ట్స్ జర్నలిస్టు అసోసియేషన్ తెలంగాణ (ఎస్‌జేఏటీ) 2025 డైరీని భట్టి విక్రమార్క శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వార్షిక బడ్జెట్‌లో క్రీడలకు మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. జాతీయ క్రీడల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉన్నదని, బిడ్ వేసేందుకు చొరవ తీసుకుంటానని అన్నారు. క్రీడలు, క్రీడా సంఘాల సమాచారంతో ఏర్పడిన ఎస్‌జేఏటీ డైరీని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జేఏటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సంజయ్, సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో 10 ఎస్బీఐ బ్యాంకులు ప్రారంభం

సిటీబ్యూరో, ఫిబ్రవరి21(నమస్తే తెలంగాణ): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) తెలంగాణలో నూతనంగా 10 బ్యాంకులను ప్రారంభించింది. ఎస్బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి, చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్‌తో శుక్రవారం కలిసి వాటిని ప్రారంభించారు. అలంపూర్ ఎక్స్ రోడ్డు, చినం బావి, రాఘవేంద్ర కాలనీ, నీయో పోలీస్, కిష్టారెడ్డిపేట, ఖాజాగూడ, ఉస్మాన్ నగర్, కంగ్టి, సుచిత్ర, నందిపేట ప్రాంతాల్లో నూతన బ్రాంచులను ప్రారంభించారు. ఇందులో ఐదు అర్బన్, ఐదు రూరల్ ప్రాంతాల్లో ఉండటం గమనార్హం.

మానవ అక్రమ రవాణాను నిర్మూలిద్దాం

ఎంసీహెచ్చార్డీలో శిక్షణ కార్యక్రమం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 21: మానవ అక్రమ రవాణాను నిర్మూలించడంలో పలు స్వచ్ఛంద సంస్థలతో పాటు పౌరులు మరింత చురుకైన పాత్రను పోషించాల్సి ఉందని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ప్రజ్వల సంస్థతో పాటు సెర్ప్ ఆధ్వర్యంలో రెండురోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో పాల్గొన్న సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ విజయలక్ష్మితో కలిసి ప్రజ్వల ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా మానవ అక్రమ రవాణా ఎంతో వేగంగా విస్తరిస్తోందన్నారు. వివిధ కారణాలతో అనేక మంది అమ్మాయిలు మానవ అక్రమ రవాణా బారిన పడుతూ దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. పేద మధ్య తరగతి అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలపై సామాజిక కార్యకర్తలు దృష్టి పెట్టాలని, వారి ఆర్థిక సామాజిక స్థితిగతులను మెరుగుపర్చుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నతనం నుంచే ఫోన్ల వాడకం పెరిగిపోవడంతో సైబర్ ట్రాఫికింగ్ బారిన యువతులు, బాలికలు పడుతున్నారని మాయమాటలు చెప్పి వారిని వ్యభిచార కూపాల్లోకి దింపుతున్నారని వివరించారు. ప్రభుత్వ శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థలు గ్రామీణ స్థాయి నుంచే ఈ సమస్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటి దాకా 30 వేల మంది యువతులను, మహిళలను మానవ అక్రమ రవాణా బారి నుంచి కాపాడామని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా సైబర్ ఆధారిత మానవ అక్రమ రవాణ, బీఎన్ఎస్, పోక్సో చట్టాలు, సఖి, భరోసా, చైల్డ్ లైన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెర్ప్ సిబ్బంది, ప్రజ్వల ప్రతినిధులు సురేశ్ కుమార్, అంబర్ సింగ్, మిథాలీ రాజ్, ప్రవంతితో పాటు వివిధ జిల్లాల నుంచి డీపీఎంలు, ఏపీఎంలు, వీవోఏలు పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న పలు సంస్థల ప్రతినిధులు

చట్ట సభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలి

- ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయించాలి
- మార్చ్ 12, 13 తేదీల్లో చలో ఢిల్లీ
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

చలో ఢిల్లీ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, డా. ఎన్.మారేశ్ తదితరులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి21: దేశ వ్యాప్తంగా 60 శాతం ఉన్న ఓబీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి 2 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఓబీసీలకు ఫీజు రీయిబర్స్‌మెంట్, గురుకుల పాఠశాలలు, రెసిడెన్సీ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంఘం, దక్షిణాది రాష్ట్రాల ఓబీసీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య విచ్చేయగా, సభకు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేశ్ సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం మార్చ్ 12, 13 తేదీలో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏపీ భవన్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఓబీసీ డిమాండ్లపై మేధావుల సదస్సును నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు హాజరవుతున్నారని కృష్ణయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దక్షిణాది రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున 100పైగా కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, ఉద్యోగ సంఘాలు హాజరు కాబోతున్నాయని ఆయన తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు దాటినా ఓబీసీలకు మాత్రం రాజకీయ స్వాతంత్ర్యం రాలేదని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు సాధించడంతోనే ఓబీసీలకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. దేశవ్యాప్తంగా కుల గణన జరగవలసిన చారిత్రాత్మక ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా నేడు ఓబీసీలపై దృష్టి సారించిందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓబీసీల పక్షపాతి అని, మోదీతోనే ఓబీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. నేడు ఉద్యమం పతాక స్థాయికి చేరుకున్నదని, ఈ దశలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. మార్చ్ 12,13వ తేదీల్లో చలో ఢిల్లీ బీసీ మేధావుల సదస్సును పెద్ద ఎత్తున ఓబీసీలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఎన్.మారేశ్ మాట్లాడుతూ బీసీల ఆరాధ్య దైవం అయిన ఆర్.కృష్ణయ్య, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లపై చర్చించి ఒప్పించి రాజకీయ రిజర్వేషన్లు సాధించాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. అన్ని పార్టీలు బీసీల రిజర్వేషన్లపైనే దృష్టి సారించాయని తెలిపారు. అనంతరం, మార్చ్ 12,13వ తేదీల్లో నిర్వహించే చలో ఢిల్లీ గోడ పత్రికను ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్ర ఓబీసీ సమాఖ్య అధ్యక్షుడు జబ్బుల శ్రీనివాస్, నీరడి భూపేశ్ సాగర్, సి.రాజేందర్, పితాను ప్రసాద్, నడిపిన శ్రీనివాసరావు, నీలం వెంకటేశ్, రాజశేఖర్, అనంతయ్య, చల్లా వరుణ్, లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

మన యాసలను కాపాడుకోవాలి

ప్రముఖ కవి యాకుబ్

హైదరాబాద్, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ): మన యాసలను కాపాడుకోవాలని ప్రముఖ కవి యాకూబ్ అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా అకాడమీ కార్యదర్శి బాలాచారి ఆధ్వర్యంలో సాహితీవేత్తలతో శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. తెలుగులో చాలా మాండలికాలు ఉన్నాయని ఆయన తెలిపారు. కుటుంబంలో, పల్లెల్లో మాట్లాడే తెలుగుకు, పాఠశాలల్లో బోధించే ప్రామాణిక తెలుగు మాధ్యమానికి చాలా తేడా ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. మనిషి మాట్లాడే భాష ప్రతి మనిషికి సాంస్కృతిక హక్కు అని చెప్పారు. భాషా బోధనలో తెలుగు విద్యార్థుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య టి.గౌరీ శంకర్ మాట్లాడుతూ, మాతృభాషా దినోత్సవం నేపథ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, కాలువ మల్లయ్య, డాక్టర్ వీరేందర్, జూపాక సుభద్ర, విమల, డాక్టర్ కోయి కోటేశ్వర రావు, ప్రొఫెసర్ బాణాల భుజంగరెడ్డి, దొరవేటి చెన్నయ్య, తిరునగరి శరత్‌చంద్ర, చింతపట్ల సుదర్శన్, సగిలి సుధారాణి, కోదాటి అరుణ, ఆనందాచారి, సీతాలక్ష్మీ పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

మహాశివరాత్రి సందర్భంగా కీసరలోని భవాని రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రి కొండా సురేఖను ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

కొనసాగుతున్న ప్రత్యేక రైళ్ల ఏర్పాటు

ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రైళ్లు ఏర్పాటు చేస్తున్న ఎస్‌సీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో ప్రత్యేక రైళ్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుంది. అందులో భాగంగా చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ధన్‌పూర్‌కు నాలుగు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. ఈ నెల 22, 23 తేదీలలో ప్రత్యేక రైళ్లు నడుస్తాయని రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. మరో పక్క ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా విశాఖపట్నం నుంచి తిరుపతికి రెండు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. అయితే, ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 24 వరకు ప్రత్యేక రైళ్లు పొడిగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

తెలంగాణలో అమెరికన్ ఫుట్‌బాల్ అకాడమీలు

టాఫా నూతన అధ్యక్షులు చాగన్ల బల్వీందర్ నాథ్

అమీర్ పేట, ఫిబ్రవరి 21: అమెరికన్ ఫుట్‌బాల్, ఫ్లాగ్‌ఫుట్ బాల్ అకాడమీలు తెలంగాణ వ్యాప్తంగా ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతోందని తెలంగాణ అమెరికన్ ఫుట్బాల్ అసోసియేషన్ (టాఫా